క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఖమ్మంరూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి జనరల్ డేవిడ్‌రాజ్ అన్నారు. మండలంలోని గొల్లగూడెంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్‌హాల్‌ను పరిశీలించి నూతనంగా ప్రవేశపెట్టిన మెనూను అమలు చేయాలని తెలిపారు. సమయానుకూలంగా భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెచ్‌ఎం శ్యామరావు, వార్డెన్ రామకుమారి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ రామిశెట్టి ప్రవీణ్ రచించిన మెకానిక్స్–అస్సిలేషన్స్ అనే పుస్తకాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ బానోతు రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జానకిరామారావు, రమేశ్, రవిశంకర్, బొంద్యాలు, రాంకుమార్, శ్రీనివాసరావు, శైలజ, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లలో కట్టుదిట్టంగా ఉండాలి

ఖమ్మంమయూరిసెంటర్: రెవెన్యూ వసూళ్లలో కట్టుదిట్టంగా వ్యవహరించాలని రెవెన్యూ ఆఫీసర్ యాకూబ్‌పాషా సూచించారు. శుక్రవారం కేఎంసీలో వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి రెవెన్యూ సంబంధిత విధులు, డివిజన్లలో చేపట్టాల్సిన కర్తవ్యాలు, అండర్, సెల్ఫ్ అసెస్‌మెంట్ ప్రక్రియలపై అవగాహన కల్పించారు. ప్రాపర్టీ టాక్స్, వాటర్ టాక్స్ వసూళ్లపై అనుసరించాల్సిన చర్యలను వివరించారు.

బ్యాగులు పంపిణీ

కామేపల్లి: మండలంలోని టేకులతండా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలోని 38 మంది విద్యార్థులకు రూ.8 వేలు విలువ చేసే బ్యాగులను కామేపల్లి ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి, ఇతర అవసరాలకు నిమిత్తం రూ.5 వేల నగదును కామేపల్లి ఎంపీడీఓ రవీందర్ శుక్రవారం అందించారు. అనంతరం దాతలను పాఠశాల సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఏసీఎంఓ ఎల్.రాములు, హెచ్‌ఎం వీరన్న, మాలోత్ రాజానాయక్ పాల్గొన్నారు.

రూ.3.70లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంకు చెందిన కొల్లెం శివాజీ ముగ్గురిని ప్రతివాదులుగా చేరుస్తూ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటీషన్(ఐపీ) దాఖలు చేశాడు. ముగ్గురి వద్ద కలిపి రూ.3.70 లక్షల అప్పు చేయగా, అది తీర్చే మార్గం లేనందున దివాలాదారుడిగా ప్రకటించాలని పిటీషన్‌లో కోరాడు.



అధ్వానంగా ఉన్న జయనగర్ కాలనీ

వ్యాధులకు నిలయాలుగా..

వేధిస్తున్న రహదారులు, డ్రెయిన్ల సమస్య

- చెరువును తలపిస్తున్న ఖాళీ ప్లాట్లు
- మురుగు కంపుతో స్థానికుల అవస్థలు
- దోమలు, ఈగలతో అనారోగ్యాలు
- పట్టించుకోని అధికారులు

కాలనీల్లో సరైన రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో నగరవాసులు మురుగు నీటి కూపాల మధ్య సహజీవనం చేయాల్సి వస్తోంది. వర్షపు నీరు, ఇళ్లల్లో వాడుకున్న నీరు బయటకు పోయే మార్గం లేక ఖాళీ ప్లాట్లలో చేరి చెరువులను తలపిస్తున్నాయి. దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారి స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రధానంగా శివారు ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. మురుగు నీటితో పాటు కంప చెట్లు, పిచ్చి మొక్కలు వనాలను తలపిస్తున్నాయి. దీన్ని చూసినా వారంతా ఇందుకేనా కష్టపడి ఇళ్లు కట్టుకున్నది అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



జయనగర్ కాలనీలో మురుగు నీరు, కంపచెట్లతో ఖాళీ ప్లాట్లు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 3వ డివిజన్ జయనగర్ కాలనీ ఏర్పాటు సమయాన విశాలంగా ఉన్న వీధులు ఇప్పుడు మురికికూపాలుగా దర్శనమిస్తున్నాయి. రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలు లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలుస్తున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతుండగా.. స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 19వ, 21వ వీధుల్లో ఇప్పటికీ సీసీ రోడ్ల నిర్మాణం జరగలేదు. 21వ డివిజన్‌లో గత పాలకులు సగం రోడ్డు నిర్మాణం వేసి వదిలేశారు. దీంతో వర్షపు నీరు, మురుగునీరు పోయే మార్గం లేక వీధులన్నీ చెత్త, దుర్వాసనతో నిండిపోతున్నాయి. కాలనీలో అనేక మంది పేద, మధ్య తరగతి వారు ఎంతో కష్టపడి ఇళ్లు నిర్మించుకుంటే మాకు ఈ బాధలేంటాని మండిపడుతున్నారు.

బోరుబావుల నీరు కలుషితం

రోజుల తరబడి నిలిచిన మురుగునీరు నేలలోకి చొచ్చుకుపోవడంతో కాలనీలోని బోరుబావుల నీరు కూడా కలుషితం అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకున్నా.. కనీస సదుపాయాలు అందడం లేదని వాపోతున్నారు. ఇళ్ల మధ్యలోని ఖాళీ ప్లాట్లలో మురుగు నీరు వాన నీరు నిలిచి చిన్న పాటి చెరువులను తలపించుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పన్నులు కడుతున్నాం.. పట్టింపులేదా?

ప్రతీ సంవత్సరం తాము ఇంటి పన్నులు, ఇతర పన్నులు సకాలంలో కడుతున్నాం.. అయినా మాకు కనీస సదుపాయాలు కూడా అందడం లేదు. కాలనీ సమస్యలు అధికారులకు పట్టవా అని స్థానికుల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధుల్లో రహదారులు, డ్రెయిన్లు నిర్మించాలని కోరుతున్నారు.

మురికికూపాల్లా శివార్లు..



కాల్వకట్ట ప్రాంతంలో నివాసాల మధ్య చెరువును తలపిస్తున్న మురుగు నీరు



ఇళ్ల మధ్య పందుల స్వైర విహారం

ఖమ్మంగాంధీచౌక్: సమగ్ర డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో నగరంలోని త్రీటౌన్ శ్రీనివాసనగర్ ప్రాంతాలు మురికి కూపాల్లా దర్శనమిస్తున్నాయి. ఇళ్ల మధ్య ఉన్న స్థలాల్లో నీరు చేరి తటాకాలను తలపిస్తుండగా.. దోమలు, ఈగల సమస్యతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. అంతేకాక పిచ్చి మొక్కలు పెరిగి వనంలా పెరుగుతున్నాయి. ముఖ్యంగా శ్రీనివాస్‌నగర్‌లోని కాల్వకట్ట ప్రాంతం, సత్యసాయి బాబా వీధులు, బెస్త కాలనీ, గీతాంజలి స్కూల్ ప్రాంతం, ప్రభుత్వ పాఠశాల, టీచర్స్ కాలనీ, కట్టిల మండె ప్రాంతం, అయ్యప్ప టెంపుల్ నుంచి అగ్రహారం రోడ్డులో, పెట్రోల్ బంక్ వెనక ప్రాంతాల్లో మురుగు నీటి సమస్య ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. ఖాళీ ప్లాట్లలో చేరిన మురుగు చాలా రోజులుగా నిల్వ ఉండడంతో కంపుకొడుతుందని, పాములు, తేళ్లు ఇళ్లల్లోకి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

సమస్యకు చెక్ పెట్టేలా..

ఖాళీ ప్లాట్లలో మురుగు నీరు నిల్వ ఉండకుండా మున్సిపల్ విభాగం సమగ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంది. కంప చెట్లు, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రంగా ఉండేలా ప్లాట్ల యజమానులను నోటీసులు జారీ చేయాల్సి ఉంది. మురుగు నీరు, ఇళ్లల్లో వాడిన వృథా నీరు ఖాళీ ప్లాట్లలోకి చేరకుండా సమగ్ర ప్రణాళికతో ఎక్కడికక్కడ డ్రెయిన్లు నిర్మించాలి. దీంతో కొంతమేరకైనా మురుగు సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

ఇబ్బంది పడుతున్నాం..



మా వీధిలో డ్రెయిన్లు లేవు. పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం జరగలేదు. దీంతో నివాసాల్లో వాడిన నీరు, వాన నీరంతా పోయే మార్గం లేక రహదార్లపై, ఖాళీ ప్లాట్లలో నిలిచి భయానకంగా ఉంటున్నాయి. వర్షం వచ్చిన రోజు మరింత దారుణంగా ఉంటుంది. మా బాధలను గుర్తించి రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలి.

– పి.శ్రీనివాస్, 19వ లైన్, జయనగర్‌కాలనీ

సమస్యపై దృష్టి సారించాలి



ఇళ్ల మధ్య ఖాళీ పాట్లలో మురుగు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. పిచ్చి మొక్కలు వనంలా పెరిగి ఇళ్లల్లోకి విషకీటకాలు చేరుతున్నాయి. రాత్రిళ్లు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే భయపడాల్సి పరిస్థితి ఉంది. మురుగు సమస్య పరిష్కారానికి మున్సిపాలిటీ విభాగం దృష్టి సారించాలి.

– కామినేని శ్రీనివాసరావు, శ్రీనివాస్‌నగర్

నిధులు మంజూరయ్యాయి..

కాలనీలో సమస్యలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. దీంతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. త్వరలోనే ఆ పనులు పూర్తయితే చాలా వరకు సమస్యలు పరిష్కారం అవుతాయి.

– మలీదు మనీష్, కాంగ్రెస్ నాయకుడు

యూరియా సకాలంలో అందించాలి

ఖమ్మంరూరల్: రైతులకు యూరియా సకాలంలో అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ కోరారు. ఈ మేరకు ఏఓ ఉమా నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట పెద్ద వెంకటరెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, వెంకటప్పయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

● **కలెక్టర్‌కు విజ్ఞప్తి..**

ఖమ్మం అర్బన్: జిల్లాలో నెలకొన్న యూరియా కొరతను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని టీడీపీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో సీనియర్ నేత మందడపు సుధాకర్, ఖమ్మం పార్లమెంట్ మాజీ కార్యదర్శి కేతినేని హరీష్, నాయకులు నాగేశ్వరరావు, ఉపేందర్, రామారావు, రమేష్ పాల్గొన్నారు.

● **చిమ్మపూడిలో యూరియా, అల్లిపురంలో కూపన్లు పంపిణీ**

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: రైతుల అవసరాలకు అనుగుణంగా సహకార సంఘాల పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్ సెంటర్ల ద్వారా యూరియా పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. శుక్రవారం మంచుకొండ సహకార సంఘం పరిధిలోని చిమ్మపూడి సబ్ సెంటర్లో 335 యూరియా బస్తాలను పోలీసు బందోబస్తు మధ్య రైతులకు కూపన్లు అందించి ఎరువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర్‌రెడ్డి, మంచుకొండ సొసైటీ సీఈఓ ఎస్.శ్రీనివాసరావు, సొసైటీ సిబ్బంది, ఏఈఓలు పాల్గొన్నారు. కాగా, వీవీపాలెం సహకార సంఘం పరిధిలోని అల్లిపురం సబ్ సెంటర్‌లో సరిపడా యూరియా స్టాక్ లేకపోవడంతో కూపన్లు మాత్రమే అందించి, శనివారం పంపిణీ చేస్తామన్నారు. సీఈఓ తిరుపతిరావు, సొసైటీ చైర్మన్ రావూరి సైదులు, చైర్మన్ సైదుబాబు పాల్గొన్నారు.



చిమ్మపుడి యూరియా పంపిణీలో అధికారులు

● **రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా**

నేలకొండపల్లి: రైతులకు యూరియా సరిపడా అందించాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్‌లో అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు, నాయకులు ఇంటూరి అశోక్, రచ్చా నరసింహారావు, ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టికోల వెంకటేశ్వర్లు, మందడపు మురళీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహం విద్యార్థులకు శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సౌజన్య విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. అనతరం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వసతి గృహ సంక్షేమాధికారి జంగం వేణు, వైద్య సిబ్బంది మీనా, అరుణ, జానకీ, రమాదేవి పాల్గొన్నారు.

రోడ్ల శుభ్రత పనులు వేగవంతం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో రహదారుల శుభ్రతకు వినియోగిస్తున్న ఆధునిక స్వీపింగ్ మిషన్ పనితీరును శుక్రవారం డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ పరిశీలించారు. నగరంలో రోడ్ల శుభ్రతను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి మరో స్వీపింగ్ మెషిన్‌కు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురాగా వాటి పనితీరును పరిశీలించారు. ఇకనుంచి శుభ్రపరిచే పనులు మరింత వేగవంతం అవుతాయన్నారు.

'అందుబాటు ధరల్లో ప్లాట్లు'



మాట్లాడుతున్న ఎండీ రాంబాబు

రఘునాథపాలెం: అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో ప్లాట్లు అమ్మేలా వెంచర్లు చేస్తున్నట్లు జయ విలాసిని కన్‌స్ట్రక్షన్స్ డెవలప్‌మెంట్(జేవీడీ) ఎండీ కుంచపు రాంబాబు తెలిపారు. రఘునాథపాలెం మండలం జింకలతండా రోడ్డులో వెంచర్ బ్రోచర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఇక్కడి ప్లాట్లకు విలువ పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాగం శ్రీను, చెన్ను కొండయ్య, అనంత రాజు, ఆకుమయ్య, టీవీ.రాజు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

ఎంపీ వద్దిరాజుకు సన్మానం



రవిచంద్రను సన్మానించిన మున్నూరుకాపు నేతలు

ఖమ్మంమామిళ్లగూడెం: అమెరికాలో మున్నూరు కాపు బిడ్డలు చూపిన ఆదరణ, ఆప్యాయత మరువలేనని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఇటీవల అమెరికా పర్యటన ముగించుకొని ఖమ్మం వచ్చిన ఆయనను శుక్రవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యాన సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆకుల గాంధీ అధ్యక్షత వహించగా వద్దిరాజు మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడిన మున్నూరు కాపులంతా కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని తాను చేసిన సూచనకు అంగీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం బాధ్యులు మేకల భిక్షమయ్య, పారా నాగేశ్వరరావు, జాబిశెట్టి శ్రీనివాసరావు, కనకం జనార్దన్, తోట రామారావు, శీలంశెట్టి వీరభద్రం, తోట వీరభద్రం, మాటేటి రామారావు, పసుపులేటి వెంకట్, మేకల శ్రీనివాసరావు, మేకల నాగేందర్, పిన్ని కోటేశ్వరరావు, యాసా రామారావు, గుళ్లపల్లి శేషగిరిరావు, ఎర్రా అప్పారావు, తోట రమేష్, మధు, మారిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నియామకం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్‌జీపీఏటీ) రాష్ట్ర కార్యదర్శిగా ఖమ్మానికి చెందిన మేరి ఏసుపాదం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మహాసభలో ఆమెను ఎన్నుకున్నారు. 1990లో పీజీటీగా వైరాలో ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె వివిధ హోదాలో పనిచేసి డిప్యూటీ సెక్రటరీగా ఉద్యోగ విరమణ పొందారు. ఈమేరకు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్, నాయకులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, శరత్‌బాబు, అంజలి, లక్ష్మీ సుజాత అభినందనలు తెలిపారు.

'ఆ ప్రచారంలో వాస్తవం లేదు..'

ఖమ్మం మామిళ్లగూడెం: సినిమాల్లో మాదిరి మృతి చెందిన వ్యక్తికి వైద్యం చేసి ఫీజు తీసుకున్నారంటూ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) బాధ్యులు తెలిపారు. ఖమ్మం శుక్రవారం పలువురు సభ్యులు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన యువకుడు కామెర్ల బారిన పడగా నాటువైద్యం అనంతరం హైదరాబాద్ తీసుకెళ్లారని చెప్పారు. అక్కడ పరిస్థితి విషమిస్తుండడంతో మళ్లీ నాటు వైద్యం చేయించి ఖమ్మం సాయిరాం గ్యాస్ట్రో ఆస్పత్రికి తీసుకొచ్చారని తెలిపారు. కుటుంబీకుల అంగీకారంతో ఐదు రోజుల చికిత్స జరగగా, ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తామనడంతో పంపించామని చెప్పారు. అయితే, అక్కడకు వెళ్లాక సదరు యువకుడు మృతి చెందితే, అప్పటికే మృతి చెందిన వ్యక్తికి చికిత్స చేసి ఫీజు తీసుకున్నట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు కంభంపటి నారాయణతో పాటు బొల్లికొండ శ్రీనివాసరావు, స్వాతి, కూరపాటి ప్రదీప్, రవికుమార్, సుధీంద్రరెడ్డి, ప్రియాంక పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం..



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శుక్రవారం నగరంలోని డంపింగ్‌యార్డ్ నుంచి మల్లెమడుగు డబుల్ బెడ్రూం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. మొత్తం రూ.2 కోట్ల వ్యయంతో ప్రజలకు రవాణా సౌకర్యార్థం రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం పెట్ పార్క్ నిర్మాణ పనులు, చెరువు బజార్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, ఈఈ కృష్ణాలాల్, నాయకులు అంజిరెడ్డి, ఏఈ యాకూబ్ వలి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యాన నిరసన

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు వద్ద ప్రమాదకరంగా మారిన కాల్వ యూటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యాన మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఇరిగేషన్ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్, ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, కల్యాణం నాగేశ్వరరావు, హర్షవర్ధన్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కామేపల్లి/ఖమ్మంఅర్బన్/ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా నేడు(శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. ఈనేపథ్యాన కామేపల్లి మండలం పొన్నేకల్ సబ్‌స్టేషన్ పరిధిలో, ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లి సెక్షన్ పరిధి ఐడీఏ సబ్‌స్టేషన్ పరిధిలో, 15వ డివిజన్ అల్లీపురం సబ్‌స్టేషన్ పరిధిలో, ఖమ్మం నగరంలోని దానవాయిగూడెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో, బుర్హాన్‌పురం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఖమ్మం అల్లీపురం రోడ్డు విస్తరణ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అల్లిపురం రోడ్–ఐటీ హబ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఖమ్మం అర్బన్: ఖమ్మం రోటరీనగర్‌లోని సిద్ధేశ్వరి పీఠ పాలిత రాజరాజేశ్వరిదేవి సమేత శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 22నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల కరపత్రాలను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాయి వెంకటప్పయ్య తదితరులు శుక్రవారం విడుదల చేశారు. ఈనెల 22న గణపతి పూజ, నవరాత్రి కలశస్థాపనతో మొదలయ్యే ఉత్సవాలు అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగుతాయని చైర్మన్ తెలిపారు. కార్యదర్శి చిత్తారు సింహాద్రియాదవ్, సభ్యులు వీ.జీ.కే.మూర్తి, బీ.హెచ్.కిషోర్‌కుమార్, పాదిల పాపారావు, బండ్ల నరసింహారావు, బీమా సత్యం, చల్ల జయారెడ్డి, తంగెళ్ల సింహాద్రి, అక్కినేని దశరథరామయ్య, పోలూరి సుజాత పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనుల పరిశీలన

నేలకొండపల్లి: మండల కేంద్రంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పరిశీలించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొడాలి గోవిందరావు, నరేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రంలోని వేబ్రిడ్జిని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఏడీఏ సతీష్, ఎంపీడీఓ యర్రయ్య, ఏఓ రాధ, మార్కెట్ కార్యదర్శి పంతులు, వైస్ చైర్మన్ సురేష్, తన్నీరు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా మేళ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని టీటీడీ కళ్యాణ మండపంలో హైదరాబాద్‌కు చెందిన కళా సిల్క్ చేనేత హస్తకళా సొసైటీ ఆధ్వర్యాన హస్తకళా చేనేత వస్తు ప్రదర్శన అమ్మకాల స్టాళ్లను ఏర్పాటు చేసింది.దీనిలో చూడ చక్కని బొమ్మలు, ఆకట్టుకునే ధర్మవరం వెంకటగిరి, గద్వాల, పోచంపల్లి చీరలు, ఉడన్ హ్యాండ్ క్రాఫ్ట్స్, ఒడిశా పెయింటింగ్, జైపూర్ స్టోన్, జ్యూయలరీ, హర్యానా బెడ్‌కవర్స్, కోల్‌కత్తా బ్యాగ్స్, కళ్లు మిరిమిట్లు గొలిపే వస్తువులను ప్రదర్శనలో పెట్టారు. తెలంగాణలో ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, పట్టు చీరలతో పాటు ఏపీలోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కళంకారి, ఉప్పాడ, అస్సాం, ముగా, బిహార్ బాగల్పూర్ సిల్క్స్, టస్సర్, జమ్మూకశ్మీర్‌లోని ఎంబ్రాయిడరీ చీరలు, గుజరాత్‌లోని బాందని కచ్చ ఎంబ్రాయిడరీ శారీస్, రాజస్థాన్‌లోని కోటా, బంధానీ, ఉత్తరప్రదేశ్‌లోని జమ్దానీ, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్స్, ఛత్తీస్‌ఘడ్ ట్రిబిల్ వర్క్, కోసా సిల్క్, ఫ్యాన్సీ చీరలు విక్రయిస్తున్నామని నిర్వాహకులు వినోద్ జైన్ తెలిపారు.

నిధులు కేటాయించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పెండింగ్‌లో ఉన్న సీసీ, బీటీ, లింక్ రోడ్ల నిర్మాణ పనులకు వెంటనే నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సంభానినగర్ బోర్డు నుంచి అల్లిపురం వరకు బీటీ రోడ్డు, పరిమిమొక్కల కాలనీ నుంచి బోనకల్ వెళ్లే సీసీ రోడ్డును నిర్మించాలని సీపీఎం వన్‌టౌన్, అర్బన్ మండల కమిటీల ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ఏ.జబ్బర్, షేక్.మీరా, సీపీఎం వన్‌టౌన్, అర్బన్ మండలాల కార్యదర్శులు షేక్.నాగుల్ మీరా, బత్తినేని ఉపేందర్, నాయకులు షేక్.బేగం, బాగం అజిత, గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థ బలోపేతానికి కృషి


ఖమ్మంలీగల్: న్యాయవ్యవస్థ బలోపేతానికి, అడ్వకేట్ల సంక్షేమం, రక్షణకు సంబంధించిన పలు కీలక అంశాలపై 'ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్'కమిటీ అధ్యక్షుడు, ఖమ్మం బార్ అసోసియేషన్ న్యాయవాది దిలీప్ చౌదరి తాళ్లూరి రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర ప్రతినిధి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా భూవివాదాలు, టెనెన్సీ, వారసత్వ సంబంధిత అప్పీలు వంటి క్వాసి–జ్యూడీషియల్ పనులు, ఆర్డీఓలు, జాయింట్ కలెక్టర్లు కాకుండా న్యాయమూర్తుల చేత చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కొత్తగా నియమితులైన లా సెక్రటరీ పాపిరెడ్డిని సన్మానించారు. ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ రాష్ట్ర కన్వీనర్, హైకోర్టు న్యాయవాది మంద శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ కసరత్తు

రఘునాథపాలెం: స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ ముందస్తు వ్యూహరచనకు శ్రీకారం చుట్టింది. ఎన్నికల షెడ్యూలు రాకపోయినా వచ్చిన వెంటనే తమ పనులు సులువుగా చేసుకునేందుకు దూకుడు పెంచింది. రఘునాథపాలెం మండలంలోని 37 జీపీలకు ఇన్‌చార్జ్‌లను నియమించి బాధ్యతలను పలువురు నాయకులకు అప్పగించారు. ప్రతీ పంచాయతీకి ఒకరిని, ఎంపీటీసీ పరిధిలో ఒకరిని, ప్రధాన పంచాయతీల్లో ఇద్దరు, ముగ్గురిని ఇన్‌చార్జ్‌లుగా నియమించినట్లు సమాచారం. సాధ్యమైనంత వరకు పంచాయతీలను ఏకగ్రీవం చేసే దిశగా కసరత్తులు ప్రారంభించింది. దానిలో భాగంగా మండలంలోని రేగులచలక, కోయచలక పంచాయతీలకు కేటాయించిన ఇన్‌చార్జీలు శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ నాయకుడు, క్యాడర్‌తో సమావేశం అయ్యారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నేలకొండపల్లి: ఇటీవల రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు స్వీకరించిన నేలకొండపల్లి ఎంఈఓ చలపతిరావును శుక్రవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సన్మానించాయి. ఈ కార్యక్రమంలో వాకదాని నాగేశ్వరరావు, కనపర్తి నాగేశ్వరరావు, మరియ ప్రసాద్, చిన్నబాబు, మరియ, మాధవరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సీతారాములు తదితరులు కూడా చలపతిరావును సన్మానించారు.



చలపతిరావును సన్మానిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు

డీఆర్‌ఓకు వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: వైద్యాన్ని వ్యాపారంగా మారుస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్‌సింగ్, రాష్ట్ర నాయకులు జిక్కుల భరత్ మాట్లాడుతూ.. ఏ చిన్న జ్వరం వచ్చినా ఇష్టంవచ్చినట్లు మందులు రాస్తూ అదికూడా ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న మెడికల్ షాపుల్లోనే రాస్తూ రేట్లు పెంచుతున్నారని, కడుపునొప్పితో వస్తే గర్భసంచి ఆపరేషన్ చేస్తున్న పరిస్థితి ఉంటుందన్నారు. వీటన్నింటిపై డీఎంహెచ్‌ఓ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి అందించి వారిలో పీవైఎల్ ఖమ్మం జిల్లా నాయకులు సీహెచ్.ధరణ్ కృష్ణ, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

'మమత'లో అరుదైన శస్త్రచికిత్సలు

ఖమ్మం అర్బన్: ఇద్దరు గర్భవతులకు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించి తల్లులు, శిశువులను కాపాడినట్లు మమత ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి పువ్వాడ జయశ్రీ తెలిపారు. ఖమ్మంలోని మమత జనరల్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో శుక్రవారం ఆమె వివరాలు వెల్లడించారు. సూర్యాపేటకు చెందిన గర్భిణికి గుండె జబ్బుతో పాటు అండాశయ కణితి నిర్ధారణ కాగా, ఐదో నెలలో కణితిని తొలగించామని, నెలలు నిండాక సిజేరియన్ ద్వారా ఆమె శిశువుకు జన్మనిచ్చిందని తెలిపారు. అలాగే, హుజూర్‌నగర్‌కు చెందిన గర్భిణికి ఆరు నెలల సమయాన ఫైబ్రాయిడ్‌ను తొలగించామని, ప్రస్తుతం ఆమె సాధారణ ప్రసవం ద్వారా మగ శిశువుకు జన్మనిచ్చిందని వెల్లడించారు. ఈ శస్త్రచికిత్సల్లో వైద్యులు బి.కవిత, స్నేహ, దేవిశ్రీ, రామస్వామి, గీత, మనీషా తదితరులు పాల్గొనగా, కార్యదర్శి జయశ్రీతో పాటు విభాగాధిపతులు నైమిషా మోవ్వా, బి.అనురాధ, బి.రామస్వామి, కె.సంతోష్‌రెడ్డి అభినందించారు.

రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుక్క సత్యం అధ్యక్షతన ఖమ్మం ఎన్నెస్పీ క్వార్టర్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ వేతనల నుంచి దాచుకున్న జీపీఎఫ్, పెన్షన్ సొమ్మును గత మూడేళ్లుగా తెలంగాణ పాలకులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యమ నాయకులు పాలకుర్తి కృష్ణ, అంబాల రామారావు, చారి, సత్యం, అంజయ్య, పాపయ్య, ప్రసాద్, అంగిడి భిక్షం, షేక్ ఫక్రుద్దీన్, గురవయ్య, నరసింహారావు, ముత్తయ్య, వెంకన్న, వెంకటేశ్వర్లు, వీరబాబు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు, హైదర్‌సాయిపేట విద్యుత్ సబ్‌స్టేషన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన లెవెన్ కే.వీబ్రేకర్లను, తిరుమలాయపాలెం విద్యుత్ కార్యాలయంలో మరమ్మతులు చేసిన ఏఈ కొత్త కొత్త బిల్డింగ్‌లను విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి శుక్రవారం ప్రారంభించారు. నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడం కోసం అనేక మార్పులు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆపరేషన్ సీహెచ్.నాగేశ్వరరావు, కన్‌స్ట్రక్షన్ డీఈ జె.బద్రు పవర్, ఎంఆర్‌టీ రమేష్, ఏదులాపురం డీఈ బి.రామకృష్ణ పాల్గొన్నారు.